క్లుప్తంగా

పాఠశాలలో పనులు ప్రారంభం


పనులు ప్రారంభిస్తున్న నాయకులు

ఖానాపూర్: మండలంలోని బాదనకుర్తి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం ఈజీఎస్ నిధులు రూ.10లక్షలతో మరుగుదొడ్లు, కిచెన్‌షెడ్ నిర్మాణ పనులను కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ఆదేశాల మేరకు ప్రారంభించిన పనులు సకాలంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు ఎస్‌కే సాజిద్, గుడాల రాజన్న, గంగరాజం తదితరులు ఉన్నారు.

ఘనంగా గంగనీళ్ల జాతర


జాతరలో పాల్గొన్న గ్రామస్తులు

సోన్: మండలంలోని న్యూవెల్మల్ గ్రామంలో ఆదివారం వీడీసీ ఆధ్వర్యంలో గంగనీళ్ల జాతర ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామపెద్దలు డప్పు చప్పుళ్ల నడుమ గూండ్లవారి వలలతో గోదావరి జలాలను తీసుకొచ్చి వనదేవతలకు, గ్రామ దేవతలకు అభిషేకం చేశారు. పాడిపంటలు, పిల్లాపాపలతో సిరిసంపదలు కలగాలని వనదేవతలను వేడుకున్నారు. అనంతరం వనభోజనాలు చేసుకొని కుటుంబ సమేతంగా గడిపారు. వీడీసీ చైర్మన్ జిలకర వేణు, రైటర్ బట్టు గంగాధర్, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

టీపీసీసీ ప్రధాన కార్యదర్శికి సన్మానం


రాజేశ్వర్‌ను సన్మానిస్తున్న నాయకులు

ఖానాపూర్: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎంబడి రాజేశ్వర్ ఇటీవల టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఆదివారం ఖానాపూర్ కాంగ్రెస్ నాయకులు జిల్లాకేంద్రంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బానావత్ గోవింద్, రాచమల్ల అశోక్, సూర్యకాంత్, శేఖర్, రాకేశ్, ప్రసాద్ తదితరులు ఉన్నారు.

సత్యసాయి చిత్రపటాలు పంపిణీ


చిత్రపటాలు అందిస్తున్న నాయకులు

ఖానాపూర్: పుట్టపర్తి సత్యసాయి వందో జయంతి పురస్కరించుకుని ఆదివారం పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో సత్యసాయి బాబా చిత్రపటాలను కాలనీవాసులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు భీంసింగ్ మాట్లాడారు. ప్రతీ ఒక్కరూ ఆధ్యాత్మిక భావనతో ముందుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి సభ్యులు రత్నాకర్‌రావు, పాల గంగాధర్, ఘంటశాల గంగాధర్, శ్రీకాంత్ కిశోర్, శంకర్ రాజన్న, బలసు రాజలింగు, ప్రసాద్ ఉన్నారు.

రేపు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక

ఖానాపూర్: పట్టణంలోని విద్యుత్‌శాఖ కార్యాలయంలో ఈ నెల 17న మంగళవారం ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు ఏడీఈ టి.శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. ఖానాపూర్, కడెం, పెంబి, దస్తురాబాద్, మామడ మండలాలకు చెందిన విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను సదస్సులో విన్నవించి పరిష్కరించుకోవాలని కోరారు.

రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియామకం


సిబ్బల దత్తాద్రి

కుంటాల: చాకలి ఎస్సీ సాధన సమితి కార్యవర్గాన్ని హైదరాబాద్ బీసీ సాధికారిక భవనంలో రాష్ట్ర అధ్యక్షురాలు కొత్త కొండ లక్ష్మి ఆధ్వర్యంలో ఆదివారం నియామకాలు చేపట్టారు. కుంటాల మండలంలోని వెంకూర్ గ్రామానికి చెందిన సిబ్బిల దత్తాద్రిని చాకలి ఎస్సీ సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమించారు. ఈమేరకు దత్తాద్రిని పలువురు అభినందించారు.


గుంతలమయమైన రోడ్డు

రోడ్డు ఇలా.. రాకపోకలు ఎలా?


మల్లాపూర్ సమీపంలో ఏర్పడిన గుంతలు

లక్ష్మణచాంద: మండలంలోని ధర్మారం నుంచి మల్లాపూర్ గ్రామానికి వెళ్లే ప్రధాన రోడ్డు గుంతలమయంగా మారింది. చిన్నపాటి వర్షానికేబురదమయంగా మారుతోంది. గుంతల్లో నీరు నిలుస్తుండటంతో లోతు తెలియక వాహనదారులు అదుపుతప్పి కింద పడుతున్నారు. అధికారులు స్పందించి గుంతలను పూడ్చి ఇబ్బందులను దూరం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అదుపుతప్పితే కాల్వలోకే..



లక్ష్మణచాంద: మండలంలోని ధర్మారం నుంచి మల్లాపూర్ వెళ్లే మార్గంలో ప్రధాన రోడ్డు కల్వర్టుపై రక్షణ గోడ కూలిపోయింది. రాత్రి రాకపోకలు సాగించే వాహనదారులు అదుపుతప్పి కాలువలో పడే ప్రమాదం ఉంది. అధికారులు రక్షణ చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

విద్యుత్ స్తంభాలు సరిచేయరూ..!


నర్సాపూర్(జి) శివారులో పడిపోయేలా స్తంభం


నందన్ ఎక్స్‌రోడ్డు ఎదుట..

నర్సాపూర్(జి): మండలకేంద్రం శివారులో, నందన్ ఎక్స్‌రోడ్డు ఎదుట వ్యవసాయ భూముల్లో వంగిన కరెంటు స్తంభాలు ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. ఈదురుగాలులకు స్తంభాలు నేలకొరిగే ప్రమాదం ఉంది. వానాకాలం సాగు పనులు ప్రారంభమైనందున ఎలాంటి నష్టం జరగకముందే విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి వంగిన స్తంభాలను సరిచేయాలని రైతులు వేడుకుంటున్నారు.


భయంభయంగా చదువులు

- శిథిలావస్థకు భైంసా జూనియర్ కళాశాల భవనం
- గదుల్లో పైకప్పు పెచ్చులూడుతున్న వైనం
- అధ్వానంగా బెంచీలు, పరిసరాలు
- కలెక్టర్ స్పందించి కొత్త భవనం నిర్మించాలంటున్న విద్యార్థులు

భైంసాటౌన్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల (తెలుగుమీడియం) భవనం శిథిలావస్థకు చేరింది. దాదాపు 40ఏళ్ల కిందట నిర్మించిన భవనం కావడంతో వర్షానికి భవనం పైకప్పు పెచ్చులూడుతోంది. గోడలు పగుళ్లు ఏర్పడి పైకప్పు ఊరుస్తోంది. ఎప్పుడు ఏయే గోడ కూలుతుందోనని విద్యార్థులు, అధ్యాపకులు భయభయంగా కాలం వెల్లదీస్తున్నారు. భైంసాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలుగు, మరాఠీ, ఉర్దూ మీడియం అందుబాటులో ఉండగా 450 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఉర్దూ మీడియంలో ఎంపీసీ, బైపీసీ, హెచ్‌ఈసీ, మరాఠీ మీడియంలో హెచ్‌ఈసీ, తెలుగు మీడియంలో బైపీసీ, హెచ్‌ఈసీ కోర్సులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఒకేషనల్ కోర్సులు సైతం అందుబాటులో ఉన్నాయి. ఉర్దూ మీడియం విద్యార్థులకు నూతన భవనం అందుబాటులో ఉండగా, తెలుగు, మరాఠీ మీడియం విద్యార్థులకు శిథిలావస్థకు చేరిన పాత భవనంలోనే తరగతులు నిర్వహిస్తున్నారు.

నూతన భవనం నిర్మిస్తే ప్రయోజనం..

ఇటీవల కుభీర్ మండలం అంతర్ని గ్రామంలో శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనం కూలి చిన్నారులు గాయపడిన విషయం తెలిసిందే. దీంతో కలెక్టర్ అభిలాష అభినవ్ జిల్లాలోని శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ పాఠశాలల భవనాలను గుర్తించి కూల్చివేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈనేపథ్యంలో శిథిలావస్థకు చేరిన భైంసా ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం కూల్చివేయించి.. కొత్త భవనం నిర్మించేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.


భవనం గోడ మధ్యలో పెరుగుతున్న చెట్టు


గోడలను చీల్చుతున్న చెట్టు వేర్లు

దాతలు సహకరిస్తే...

పట్టణంతోపాటు పరిసర గ్రామాలకు ఈ కళాశాల సమీపంలోనే ఉన్నా.. సరైన వసతులు, తరగతి గదులు లేకపోవడంతో విద్యార్థుల సంఖ్య ఏటా తగ్గుతోంది. కూర్చునేందుకు సరైన డెస్క్‌బెంచీలు, బ్లాక్‌బోర్డులు, డిజిటల్ బోర్డులు లేవు. బోటనీ, ఫిజిక్స్ సైన్స్ ల్యాబ్‌లు లేకపోవడంతో విద్యార్థులకు సంబంధిత విషయ జ్ఞానం అందడం లేదు. అనుభవజ్ఞులైన అధ్యాపకులతో నాణ్యమైన విద్య అందుతున్నప్పటికీ వసతులు లేక విద్యార్థులు ప్రవేశాలకు ఆసక్తి చూపడం లేదు. ఈ నేపథ్యంలో దాతలు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించి కళాశాల అభివృద్ధికి సహకరించాలని అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదిస్తాం..

తెలుగు మీడియం కళాశాల భవనం శిథిలావస్థకు చేరింది. ఇటీవల బోర్డు కార్యదర్శి, జిల్లా ఇంటర్ అధికారి వచ్చినప్పుడు పరిస్థితిని వారికి వివరించాం. ఆర్‌అండ్‌బీ ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడి భవన నాణ్యతపై నివేదిక కోరుతాం. ఆ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటాం. దాతలు, ప్రజాప్రతినిధులు కళాశాల అభివృద్ధికి ముందుకు రావాలి. – శివరంజని, ప్రిన్సిపాల్


సైన్స్ ల్యాబ్‌లో పెచ్చులూడుతున్న పైకప్పు


తరగతి గదిలో అధ్వానంగా బెంచీలు

ప్రధాని పాలనకు విశ్వవ్యాప్త గుర్తింపు

- కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్


కుంటాల : మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామారావు

కుంటాల: దేశం కోసం అహర్నిశలు కష్టపడిన ప్రధాని మోదీ పాలనకు విశ్వవ్యాప్తంగా గుర్తింపు లభిస్తుందని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రితీశ్ రాథోడ్ పేర్కొన్నారు. ఆదివారం కుంటాలలోని యాదవ సంఘ భవనంలో మోదీ పాలన 11 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యశాల సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ బలిదానంతోపాటు యోగ దివాస్, ఎమర్జెన్సీ దివాస్ అంశాల గురించి కార్యకర్తలకు వివరించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. అహ్మదాబాద్‌లో విమాన ప్రమాదంలో మృతి చెందిన వారికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. మండల కన్వీనర్ పసుల నవీన్, మాజీ ఎంపీపీలు గజ్జారాం యాదవ్, అరుణ రమణారావు, మండల కన్వీనర్లు దత్తాద్రి, రావుల రాము, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అశోక్‌కుమార్, వెంగల్‌రావు, గజేందర్, రవి ఉన్నారు.

మైసమ్మ ఆలయాభివృద్ధికి కృషి

భైంసాటౌన్: పట్టణంలోని కిసాన్‌గల్లీ గట్టు మైసమ్మ ఆలయ అభివృద్ధికి దశలవారీగా కృషి చేస్తానని ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన ఆలయంలో రూ.5లక్షలతో చేపట్టే మెట్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయానికి భక్తులు వచ్చే రోడ్డు సరిగా లేకపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు లేకుండా మెట్లను నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట బీజేపీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు. గోవర్ధన్, చిన్నారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి ఉన్నత స్థాయికి ఎదగాలి


సన్మాన గ్రహీతలతో నరేంద్రబాబు

లోకేశ్వరం: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు ఎదిగి కన్నవారికి మంచి పేరు తేవాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు తోట నరేంద్రబాబు అన్నారు. ఆదివారం మండలంలోని పిప్రి గ్రామ మున్నూరుకాపు సంఘం భవనంలో.. మండలంలో పది, ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులతోపాటు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన వారిని మండల మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. ఈసందర్భంగా నరేంద్రబాబు మాట్లాడుతూ ఉన్నత చదువులు చదివేలా పిల్లలను ప్రోత్సహించాలని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ మండలాధ్యక్షుడు రాజేందర్, మున్నూరు కాపు సంఘం మండలాధ్యక్షుడు మంద లింగన్న, భోజన్న, నిర్మల్ ఆదర్శనగర్ సంఘం అధ్యక్షుడు గజ్జరాం, పిప్రి గ్రామ సంఘం అధ్యక్షుడు విలాస్, బర్ల చిన్నయ్య ఉన్నారు.

భీమన్న ఆలయంలో పూజలు


భైంసాలో పూజలు చేస్తున్న భక్తులు

భైంసా: పట్టణంలోని గడ్డెన్నవాగు ప్రాజెక్టు సమీపంలో ఆదివారం భీమన్న పండుగ ఘనంగా నిర్వహించారు. డప్పుచప్పుళ్ల నడుమ ఆలయానికి వెళ్లి పూజలు చేశారు. సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు పండాలని మొక్కుకున్నారు. కార్యక్రమంలో పి.రాందాస్, లక్ష్మణ్, శేఖర్, సునీల్, సాంబన్న తదితరులు ఉన్నారు.


నర్సాపూర్(జి) : జలాలు తీసుకొస్తున్న సభ్యులు

నర్సాపూర్(జి): మండలకేంద్రంలో ఆదివారం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో భీమన్న దేవుడి పండుగ నిర్వహించారు. డప్పుచప్పుళ్ల నడుమ గోదావరి జలాలను తీసుకొచ్చి గ్రామదేవతలకు, భీమన్న గదలకు అభిషేకం చేశారు. పంటలు బాగా పండాలని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

బీరప్ప దేవుడికి పూజలు


ఆలయానికి వెళ్తున్న కుర్మ సంఘం సభ్యులు

ముధోల్: మండలకేంద్రంలోని దస్‌గల్‌గల్లీ కుర్మ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం బీరప్ప దేవుడికి బోనాలను నైవేద్యంగా సమర్పించారు. కుర్మ సంఘం కులుస్తులు ప్రతి ఏటా గ్రామం నుంచి కాలినడకన బీరప్ప ఆలయానికి వెళ్లి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అన్నదానం చేశారు.

నేడు 'రైతునేస్తం'లో సీఎం ప్రసంగం

ఖానాపూర్: రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా మండలంలోని దిలావర్‌పూర్ రైతువేదికలో సోమవారం వీడియో కాన్ఫరెన్సు ప్రారంభించనున్నట్లు వ్యవసాయాధికారులు తెలిపారు. సోమవారం సాయంత్రం 4 గంటలకు సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ అగ్రికల్చర్ యూనివర్సిటీ ఆడిటోరియంలో వర్చువల్‌గా ప్రారంభించే ఈ కార్యక్రమాన్ని వీక్షించేందుకు రైతులు హాజరవాలని అధికారులు పేర్కొన్నారు.

తానూరు: రైతునేస్తం మూడోదశ కార్యక్రమంలో భాగంగా సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి రైతులను ఉద్దేశించి ప్రసంగించే వీడియో కాన్ఫరెన్స్‌ను వీక్షించేందుకు మండలకేంద్రంలోని రైతువేదికకు రైతులు, అధికారులు హాజరవాలని ఏవో మనీషా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు, అధికారులు హాజరవాలని కోరారు.

జొన్నల డబ్బులు జమచేయాలి

కుంటాల: యాసంగిలో కొనుగోలు కేంద్రాల్లో జొన్నల పంట అమ్ముకున్న రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని బీజేపీ నాయకులు రమణారావు ఆదివారం హైదరాబాద్‌లో మార్క్‌ఫెడ్ ఎండీ శ్రీనివాస్‌రెడ్డిని కలిసి విన్నవించారు. పంట అమ్మి 45 రోజులు గడుస్తున్నా.. డబ్బులు రాకపోవడంతో వానాకాలం పెట్టుబడులకు రైతులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు.

గుంతల రోడ్డుతో తిప్పలు


బురదమయంగా రోడ్డు

నర్సాపూర్(జి): మండలకేంద్రం నుంచి మండలంలోని నందన్, బామ్ని(బి), తురాటి, అంజకంటి గ్రామాలకు వెళ్లే బీటీ రోడ్డు(12.3 కిలోమీటర్లు) గుంతలమయంగా మారింది. ఇటీవలి వర్షాలకు ఈ రోడ్డు బురదమయంగా మారింది. ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 2024 నవంబర్ మాసంలో 12.3 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణానికి రూ.ఐదు కోట్లు మంజూరయ్యాయని ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కానీ ఇప్పటికీ నిధులు విడుదల కాకపోవడంతో రోడ్డు పనులు ప్రారంభించలేదు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి నిధులు విడుదల చేసి రోడ్డు నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

'భట్టి' జన్మదిన వేడుకలు

కడెం: మండలకేంద్రంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క జన్మదిన వేడుకలను ఆదివారం కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పడిగెల భూషణ్, ఆర్టీఏ జిల్లా సభ్యులు మల్లేశ్, సతీశ్‌రెడ్డి, కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు రమేశ్, జిల్లా కార్యదర్శి ముడికె మల్లేశ్‌యాదవ్, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రెంకల శ్రీనివాస్‌యాదవ్ తదితరులున్నారు.

పోచమ్మ బోనాల పండుగ


ఊరేగింపుగా ఆలయానికి వెళ్తున్న జనం

ఖానాపూర్: మండలంలోని గోసంపల్లి గ్రామంలో ఆదివారం పోచమ్మ బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. డప్పుచప్పుళ్ల నడుమ గ్రామస్తులు ఊరేగింపుగా పోచమ్మ ఆలయానికి వెళ్లి అమ్మవారికి బోనం నైవేద్యంగా సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మహిళలు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

ధర్మారంలో..

లక్ష్మణచాంద: మండలంలోని ధర్మారం మహాపోచమ్మ ఆలయం వద్ద ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. సమీపంలోని గ్రామాల ప్రజలు మూకుమ్మడిగా ఆలయానికి వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

గ్రామ దేవతలకు పూజలు


ఊరేగింపులో భక్తులు

లోకేశ్వరం: మండల కేంద్రంలో ఆదివారం గ్రామస్తులు గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గోదావరి జలాలను ప్రధాన వీధుల గుండా తీసుకెళ్లి గ్రామ దేవతలకు అభిషేకం చేశారు. ఈసందర్భంగా పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గ్రామస్తులు ఉన్నారు.

గ్రామాల్లో సలేంద్రుని పండుగ


రాచాపూర్‌లో జలాలు తీసుకొస్తున్న సభ్యులు

లక్ష్మణచాంద: మండలంలోని రాచాపూర్, పీచర గ్రామాల్లో ఆదివారం సలేంద్రుడి పండుగ ఘనంగా నిర్వహించారు. వీడీసీ ఆధ్వర్యంలో గోదావరి జలాలను తీసుకొచ్చి గ్రామదేవతలకు అభిషేకం చేశారు. అనంతరం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. సమీపంలో వంట చేసుకొని సహపంక్తి భోజనాలు చేశారు.

బెంబరలో వైద్య శిబిరం


పరీక్షలు చేస్తున్న వైద్యుడు నరేశ్

తానూరు: మండలంలోని బెంబర గ్రామంలో ఆదివారం భైంసాలోని అరుష్ చిల్డ్రన్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. 150 మంది వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. వర్షాకాలంలో పరిసరాల శుభ్రత పాటించాలని డాక్టర్ నరేశ్ బిందెల గ్రామస్తులకు సూచించారు. శిబిరం నిర్వహించిన ఆస్పత్రి సిబ్బందిని గ్రామ కమిటీ సభ్యులు సన్మానించారు. గ్రామ కమిటీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.